సాక్షి ములుగు

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



అన్ని మతాలకు ప్రాధాన్యం

సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం పాధాన్యత కల్పిస్తోందని వరంగల్ నగర మేయర్ సుధారాణి అన్నారు.

- 8లో▸



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$40.5^0/24.7^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

మద్యం దుకాణంలో చోరీ

ములుగు రూరల్(గోవిందరావుపేట): మద్యం దుకాణంలో చోరీ జరిగిన ఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని చల్వాయిలో మారితి వైన్స్ నిర్వహిస్తున్న ఇంటిపై రేకులు తొలగించి దుకాణంలోని నగదు, మద్యం చోరీ చేశారు. చోరీకి గురైన మద్యం విలువ రూ.2లక్షల 40వేల 134, నగదు రూ.570 చోరీకి గురయ్యాయని తెలిపారు. వైన్స్ సూపర్‌వైజర్ పోషాల కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కర్నాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

భూపాలపల్లి రూరల్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు (సోమవారం) అనివార్య కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు గమనించాలని కోరారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు డ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని వేశాలపల్లి సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుకు డ్రా నిర్వహించనున్నట్లు మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ అవినాష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం పక్కన ఇల్లందు క్లబ్‌లో నేడు (సోమవారం) మధ్యాహ్నం మూడు గంటలకు డ్రా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒంటి గంట నుంచే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డబుల్‌బెడ్‌రూం పొందిన వారు ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డు తీసుకొని రావాలని సూచించారు. లబ్ధిదారులను మాత్రమే లోపలికి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాటారం: కాటారం మండలకేంద్రం మీదుగా ఆటో, రెండు బైక్‌లపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. గ్రామాల్లో పేదల నుంచి బియ్యం సేకరించి అధిక ధరకు మరో చోట విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు రెండు బైక్‌లు, ఆటోను పట్టుకొని సుమారు నాలుగు క్వింటాళ్ల బియ్యం స్వాధీన పర్చుకున్నట్లు పేర్కొన్నారు. మహాముత్తారం మండలానికి చెందిన రాజేశ్, మహారాష్ట్రకు చెందిన మధుకర్, రాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యం, వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు వివరించారు.

'బలగం' ప్రదర్శన

చిట్యాల: బలగం చిత్రాన్ని ఆదివారం మండలంలోని గోపాలపూర్‌లో ప్రదర్శించారు. ఏరుకొండ క్రిష్ణమూర్తి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు ఏరుకొండ రఘు, విష్ణు ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శన చేపట్టారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు చిత్రాన్ని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర ప్రదర్శనకు సహకరించిన ఏరుకొండ రఘు, విష్ణులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



భూపాలపల్లి అర్బన్: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నూతన పెన్షన్ స్కీమ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిల్షాద్, శివకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్షాద్, శివకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 1.76లక్షల మంది ఉద్యోగులు సామాజిక భద్రత లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగికి, ప్రభుత్వానికి సంబంధం లేకుండా ఉంటుందన్నారు. దాదాపు 30 సంవత్సరాల పాటు ప్రభుత్వం సేవలు చేయించుకొని పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. జాతీయ పెన్షన్ విధానం నుంచి రాష్ట్రం తమను తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేస్‌మెంటు లెవల్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు



అర్హులెవరు..?

లాటరీ పద్ధతిన డబుల్ ఇళ్ల ఎంపిక

- జిల్లాకేంద్రంలో జీ ప్లస్ టు నిర్మాణం
- 96 ఇళ్లకు 500 దరఖాస్తులు



ధర్నా నిర్వహిస్తున్న లబ్ధిదారులు

ములుగు: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎప్పుడిస్తారంటూ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. జిల్లాకేంద్రంలోని బండారుపల్లి రోడ్‌లో జీ ప్లస్ టూ పద్ధతిలో 96 ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా ఇప్పటి వరకు సుమారుగా 500 మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అధికారులు చెబుతుండడంతో ఎవరికి ఇళ్లు దక్కుతాయో అని ఎదురుచూస్తున్నారు.

ములుగు జిల్లా కేంద్రంలో బండారుపల్లికి వెళ్లే మార్గంలో మూడు సంవత్సరాల క్రితం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. పూర్తిస్థాయిలో స్థలం అందుబాటులో లేక జీప్లస్ టు పద్ధతిన నిర్మాణం పనులను ఆర్ అండ్ బీ శాఖ హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. ఈ క్రమంలో సకాలంలో నిధులు మంజూరు కాక కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా చేస్తూ వచ్చాడు. విషయం తెలుసుకున్న స్థానిక నిరుపేదలు తమకు డబల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కలెక్టరేట్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటూ వచ్చారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా సుమారు 500కు పైగా దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నారు. నిర్మిస్తున్న ఇండ్ల సంఖ్య తక్కువగా ఉండడం డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సంబంధిత అధికారులు తర్జన బర్జన పడుతున్నారు. ఇళ్లు ఎవరికి ఇస్తారో అని లబ్ధిదారులు కొన్ని రోజులుగా కలెక్టరేట్, నిర్మాణ ప్రాంతాల్లో ధర్నాలు చేస్తున్నారు. తమకే ఇళ్లు కేటాయించాలని పట్టుబడుతున్నారు. దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువ కావడంతో లాటరీ పద్ధతిలో ఇళ్లు కేటాయించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మొదటి నుంచి గూడు లేక ఇబ్బందులు పడుతూ ఏళ్ల తరబడి కిరాయి ఇళ్లలో ఉంటున్న వారంతా ఇళ్లు వస్తాయా లేదా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల తరచుగా ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లతో కలిసి ఆశావహులు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల వివరాలు	
కేటాయించిన ఇళ్లు	96
పూర్తికావచ్చినవి	24
స్లాబ్‌లెవల్‌లో ఉన్నవి	24
బేస్‌మెంటు లెవల్	48
దరఖాస్తు చేసుకున్నవారు	500 పైగా



పూర్తి కావచ్చిన జీ-ప్లస్ టు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం

సమయం పట్టే అవకాశం..

ఇళ్ల నిర్మాణాలు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. నిర్మాణాలకు టెండర్లు దక్కించుకున్న సమయానికి ఇప్పటికి వ్యయంలో పొంతన లేకుండా ఉంది. సిమెంట్ బస్తాలు, ఇసుక విషయంలో ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. దీంతో నిధులు మంజూరయితేనే పనులు చేస్తాననే పద్ధతుల్లో కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తవడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

అర్హులకు కేటాయించాలి



జిల్లా కేంద్రంలో నిరుపేదలు ఇళ్లులేక చాలామంది కిరాయి ఇళ్లలో పూట గడుపుతున్నారు. మరికొంత మంది గుడిసెల్లో ఉంటున్నారు. వారందరినీ ప్రభుత్వం గుర్తించి ఇళ్లు కేటాయించాలి. ఈ విషయంలో తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు వినతి పత్రాలు అందించాం. దరఖాస్తు దారుల సంఖ్య ఎక్కువగా ఉంటే మరిన్ని డబల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలి.

- ముంజాల భిక్షపతిగౌడ్, ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు

మేడారంలో భక్తుల సందడి



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సదూర ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకున్నారు. ఇటీవల పదోతరగతి పరీక్షలు ముగియడంతో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల ప్రాంతాల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.



అమ్మవార్ల సన్నిధిలో భక్తులు

నాగులమ్మ ఆలయంలో భక్తుల సందడి



నాగులమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆలయంలో అమ్మవారి పడిగె వద్ద పూజలు

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోగల లక్ష్మీనర్సాపురం శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు ప్రైవేట్ వాహనాల్లో ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలోని శ్రీ నాగులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ, నాగులమ్మ ఉపాసకుడు బాడిష రామకృష్ణ, ఆలయ ప్రధాన పూజారి నాగరమేష్ ఆదివాసీ గిరిజన సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సదానందగౌడ్

ములుగు: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ అధ్యక్షతన ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేవలం కొంతమంది సంఘ నాయకులను గుప్పిట్లో పెట్టుకొని లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాత సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తుందని ఆరోపించారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం అవుతుందని అన్నారు. నెలవారి వేతనాలను అందించకుండా ఉద్యోగులను మానసికంగా కుంగిపోయేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన శాఖలో అపరిష్కృతంగా ఉన్న అనేక రకాల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శిరుప సతీశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సోలం కృష్ణయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ విజయ్, లలిత, కిషన్‌సింగ్, అజ్మీర దశరథ్, దాసరి రామ్మూర్తి, లకావత్, శ్రీనివాస్‌నాయక్, లవనిక, సల్లూరి రమేశ్, బత్తుల సతీశరవి, వీరభద్రం, వాంకుడోతు రాంబాబు, సురేష్, అడప రాజేందర్, రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రత, బాధ్యత ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న అన్నవరం రవికాంత్

ములుగు: ఉద్యోగుల భద్రత, బాధ్యత ప్రభుత్వానిదే అని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరం శ్రీకాంత్, మంకిడి రవి అన్నారు. నూతన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలవేసిన అనంతరం గాంధీ విగ్రహం ఎదుట ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, రవి మాట్లాడుతూ న్యాయపరమైన హక్కులను సాధించుకునే వరకు ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ మాదూరి నాగేశ్వర్ రావు, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పోడెం కృష్ణప్రసాద్, పీఆర్‌టీయూ జిల్లా జనరల్ సెక్రటరీ యాకూబ్‌రెడ్డి, తెలంగాణ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గుల్లగట్టు సంజీవ, డీటీఎఫ్ జనరల్ సెక్రటరీ రేగ నరేంద్ర, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు సర్వర్ అహ్మద్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(ఎం): రాష్ట్రంలోని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుకుంటూ టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ కుటుంబానికి నాలుగు ఉద్యోగాలు వచ్చాయని.. రాష్ట్రంలోని నిరుద్యోగులంతా ఎదురుచూపులకే పరిమితమయ్యారని విమర్శించారు. నాలు గు ఉద్యోగాలు ఊడగొడితే తప్పా నిరుద్యోగులకు న్యాయం జరగదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్ల రూపాయలు కాజేశారని, బీఆర్‌ఎస్ పేరుతో కొత్త నాటకాలకు తెరతీశారని అన్నారు. రాష్ట్రంలో రానున్నది రామ రాజ్యమేనని, కాషాయ జెండా ఎగురవేస్తేనే ప్రతి ఒక్క నిరుపేదకు అభివృద్ధి ఫలాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ములుగు అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా కార్యదర్శి రవీంద్ర చారి, సీనియర్ నాయకులు కారుపోతుల యాదగిరిగౌడ్, దేవేందర్, జాటోత్ ధరమ్ సింగ్, తక్కల్లపల్లి సుమన్ రావు, గువ్వ సాంబయ్య, శ్రీధర్ రెడ్డి, సతీష్, రాసమల్ల కుమార్, అజ్మీరా రమేష్ పాల్గొన్నారు.

సమ్మె దిశగా జేపీఎస్‌లు..

గ్రామపంచాయతీల్లో మోగనున్న సమ్మె సైరన్

సర్వీస్ క్రమబద్ధీకరణకు డిమాండ్



మల్హర్‌లో ఎంపీడీఓకు వినతిప్రతం సమర్పిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

కాటారం: గ్రామపంచాయతీ పాలనలో కీలకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టనున్నారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన బాటపట్టేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమ్మె సైరన్ మోగనుంది. ఇటీవల జూనియర్ పంచాయితీరాజ్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. 28వ తేదీలోగా తమ సర్వీస్ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శుల సమగ్ర సమాచారాన్ని సేకరిస్తుండడం వారిలో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

ముగిసిన ప్రొబేషనరీ కాలం..

200మంది జనాభాకు పైగా ఉన్న గ్రామాలను, తండాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం 2018లో ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 183 మంది పంచాయతీ కార్యదర్శుల నియామకం చేపట్టారు. వీరికి మొదటి ఏడాది పాటు ప్రొబేషనరీ పీరియడ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఇదే క్రమంలో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడంతో గ్రామపంచాయతీ విధులు, బాధ్యతల నిర్వహణతో పాటు ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ భారం కూడా పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. విధులు, బాధ్యతలు అధికమవడంతో పాటు ఏ శాఖలో లేని విధంగా వారి ప్రొబేషనరీ పీరియడ్‌ను మరో నాలుగేళ్లకు ప్రభుత్వం పెంచింది. వారి నుంచి వ్యతిరేకత రావద్దనే భావనతో అదే సమయంలో వారికి ఇచ్చే వేతనాలను సైతం రెట్టింపు చేసింది. తొలి ఏడాది రూ.15వేల వేతనం చెల్లించగా, ప్రొబేషనరీ కాలాన్ని నాలుగేళ్లకు పెంచాక రూ.28,719 వేతనాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. జిల్లాలో జేపీఎస్‌లు విధుల్లో చేరిన తేదీల ఆధారంగా వారి ప్రొబేషనరీ గడువు ముగుస్తుంది. జిల్లాలో మెజార్టీ జేపీఎస్‌ల ప్రొబేషనరీ గడువు ముగిసింది. ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పిస్తుందనే నమ్మకంతో ఇన్నాళ్లు ఎదురుచూస్తూ వచ్చారు. కానీ ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణకు పూనుకోకపోవడంతో ఆందోళనబాట పట్టాలని జేపీఎస్‌లు నిర్ణయానికి వచ్చారు.

జిల్లాలో వివరాలు..
మండలాలు - 11
గ్రామపంచాయతీలు - 241
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు - 165
ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు -29
సీనియర్ పంచాయతీ కార్యదర్శులు - 39

కార్యదర్శుల వివరాలు అడిగిన ప్రభుత్వం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె దిశగా అడుగులు వేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర అప్రమత్తమైంది. జిల్లాలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమగ్ర వివరాలను అందజేయాలని ఉన్నతాధికారులు డీపీఓలకు ఆదేశాలు జారీచేశారు. కార్యదర్శి పేరు, మండలం, గ్రామం, గ్రేడ్, ఐడీ నంబర్, రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విభాగం, సస్పెన్షన్, డిప్యూటేషన్, దీర్ఘకాలిక సెలవులో ఉన్నవారి సమగ్ర సమాచారాన్ని సేకరించిన పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి వారి వివరాలు నిర్దిష్ట నమూనాలో పంపించారు. ప్రభుత్వం ఈ వివరాలు సేకరించడంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెగ్యులరైజ్ చేయాలి..



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని గ్రామపంచాయతీ స్థాయిలో విజయవంతం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం. మా పని తీరును ప్రభుత్వం గుర్తించి ప్రొబేషనరీ పీరియడ్‌ను డిక్లరేషన్ చేసి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం త్వరగా స్పందించి 28లోగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- బీరెల్లి కరుణాకర్, జేపీఎస్‌ల సంఘం జిల్లా నాయకుడు, భూపాలపల్లి

మహిళల రక్షణకు కరాటే



బ్రౌన్ బెల్ట్ అందజేస్తున్న మైపతి అరుణ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: సమాజంలో నిత్యం మహిళలపై దాడులు పెరిగాయని మహిళలకు చిన్ననాటి నుంచే కరాటే నేర్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కామారంలోని బిర్సా ముండా స్టేడియంలో సూర్య తైక్వాండో అసోసియేషన్ శిక్షణ శిబిరం, జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పోలీస్ కరాటే కోచ్ పాయం సురేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మైపతి అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. తైక్వాండో విద్య అనేది అతి ప్రాచీనమైన విద్య అని ఈ విద్యతో విద్యార్థికి క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతుందన్నారు. తైక్వాండో అకాడమీకి ప్రభుత్వ సహాయం అందించి ప్రత్యేక భవనాలు, భూమి కేటాయించి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులను కోరారు. ఈ శిక్షణలో జిల్లాస్థాయిలో 100మంది విద్యార్థులు, 15మంది మాస్టర్స్ పాల్గొని శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిర్సాముండా రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ కాక నర్సింహారావు, టెక్నికల్ డైరెక్టర్ మాస్టర్ చందా హనుమంతరావు, జనరల్ సెక్రటరీ పాయం నిసంత్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ మైపతి సంతోష్ అడ్వైజర్ చుంచు లావణ్య వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఇర్ప బాలాజీ పాల్గొన్నారు,

క్లుప్తంగా

అతిపెద్ద ప్లాస్టిక్ సర్జరీ

ఎంజీఎం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తొడ పిరుదుల భాగంలో ఊడిపోయిన చర్మానికి ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా నిర్వహించిన అతిపెద్ద శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేశామని వరంగల్‌లోని గార్డియన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కాళీప్రసాద్ ఆదివారం వెల్లడించారు. ఫిబ్రవరి 23న కడిపికొండ బ్రిడ్జి వద్ద వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కీర్తి సునీత(37) రోడ్డు ప్రమాదానికి గురైందని, సునీతపై నుంచి లారీ వెళ్లడంతో తొడ, పిరుదుల భాగం చర్మం ఊడిపోగా హుటాహుటిగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారని వివరించారు. నాలుగు రోజుల చికిత్స అనంతరం గార్డియన్‌లో చేరినట్లు తెలిపారు. ఈ మేరకు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఉపేందర్, ఆర్థో వైద్యనిపుణులు కాళీప్రసాద్, డాక్టర్ శాంతన్‌కుమార్, డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేసి ప్రాణాపాయస్థితి నుంచి ఆమెను కాపాడినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలోనే తొలిసారిగా ఈ తరహా ఆపరేషన్ చేసినట్టు డాక్టర్ కాళీ ప్రసాద్ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

దోర్నకల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాసిం తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ నాయకులు బషీర్, గారె రమేష్, బాబు, దళిత సంఘ నాయకులు కామ సంజీవరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తలారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఓ జూనియర్ లైన్‌మెన్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన భూక్యా రవి (47) గాయత్రినగర్‌లో ఉంటూ గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబపోషణ నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు పెరిగిపోవడంతో ఆందోళనకు గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. రవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

'డ్రాగన్' సాగులో సాఫ్ట్‌వేర్

- లక్షల జీతం వదిలి వ్యవసాయం
- డెయిరీ ఫామ్, కడక్‌నాథ్ కోళ్ల పెంపకం కూడా..
- ఆదర్శంగా నిలుస్తున్న భూక్యా తిరుపతి నాయక్


ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలో తిరుపతి

తరిగొప్పుల: మల్టీ నేషనల్ కంపెనీలో గౌరవప్రదమైన ఉద్యోగం.. నెలకు ఐదు లక్షల రూపాయల వేతనం.. అమెరికాలో విలాసవంతమైన జీవనం.. అన్నింటినీ వదులుకుని స్వగ్రామంలో రైతుగా మారాడు ఓ యువకుడు. తల్లిదండ్రులు చేస్తున్న వ్యవసాయంపై మమకారంతో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాగులో రైతులు ఎదుర్కొనే కష్టనష్టాలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఓ యువ సాఫ్ట్‌వేర్ సాగు బాటపట్టాడు. వ్యవసాయం మీద ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఇది వరకు ఏ రైతు సాగు చేయని పంటను పండిస్తున్నాడు. అమెరికా, చైనా వంటి దేశాల్లో అధిక మొత్తంలో సాగయ్యే డ్రాగన్ ఫ్రూట్స్ పంటను మండలానికి కొత్తగా పరిచయం చేస్తున్నాడు. తొమ్మిది ఎకరాల్లో సాగు చేయాల్సిన డ్రాగన్ ఫ్రూట్‌ను ట్రెల్లిస్ పద్ధతిలో 18,000 వేల మొక్కలతో నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. డిమాండ్ ఉన్న పండ్లను ఎంచుకుని సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందంటున్నాడు.

తరిగొప్పుల మండలంలోని జాలుబాయితండాకు చెందిన భూక్య దేవా, రుక్కమ్మ దంపతుల కుమారుడు భూక్య తిరుపతి హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ బీటెక్ పూర్తి చేసి, మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివేందుకు 2014లో అమెరికా వెళ్లాడు. 2016 మాస్టర్స్ పూర్తి చేశాడు. అనంతరం ఆపిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. నెలకు రూ.5 లక్షల జీతం. కానీ, ఉద్యోగంతో సంతృప్తి చెందక వ్యవసాయంపై ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు తనకున్న వ్యవసాయ భూమిలో రూ.60 లక్షల ఖర్చు చేసి శ్రీ సాయిరాం డైరీ ఫామ్‌ను ఏర్పాటు చేశాడు. రెండు నెలల క్రితం 4 ఎకరాల్లో మోరాకెన్‌రెడ్, అమెరికన్ బ్యూటీ, లీసా, సీ వెరైటీ రకాల డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు ప్రారంభించాడు. దీంతోపాటు స్వచ్ఛమైన పాల కోసం రూ.2.20 లక్షలతో గుజరాజ్ నుంచి గిర్ జాతి ఆవులు తెప్పించాడు. అదేవిధంగా తమిళనాడు నుంచి 200 కడక్‌నాథ్ కోడి పిల్లలను తెప్పించి పెంచుతున్నాడు. మరో ఏడాది, రెండేళ్లలో డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి ప్రారంభం అవుతుందని చెబుతున్నాడు తిరుపతి నాయక్. లక్షల వేతనాన్ని వదిలి వ్యవసాయం వైపు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భూక్యా తిరుపతి నాయక్ తాను ఎంచుకున్న రంగంలో రాణించాలని ఆశిద్దాం.


గిర్ జాతి ఆవుతో..

వ్యవసాయం చేయాలనే తపన

పరాయి దేశంలో లక్షలు సంపాదించినా సంతృప్తి లేదు. ఆర్గానిక్ వ్యవసాయం చేయాలని అనుకున్నాను. అందుకే మల్టీనేషనల్ ఐటీ కంపెనీలో ఉద్యోగం వదిలేశాను. ప్రపంచ మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్ అధికం. అందుకే ఆ పండ్లను సాగు చేయాలని నిర్ణయించుకున్నాను. దీంతోపాటు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్నాను. త్వరలోనే ఫ్రెష్ ఫాం మార్కెట్ ఏర్పాటు చేసి తాజా కూరగాయలు విక్రయిస్తాను.

-భూక్యా తిరుపతి నాయక్

వెల్‌డన్ యశ్వంత్

- గవర్నర్‌ను కలిసిన మౌంటనర్ యశ్వంత్


యశ్వంత్‌ను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటనర్ భూక్య యశ్వంత్ తెలంగాణ రాష్ట్ర గౌవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా గవర్నర్ యశ్వంత్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. పిన్న వయస్సులో ప్రాణాలను పణంగా పెట్టి ప్రపంచంలోని అతిశీతల పర్వతాలను అధిరోహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. అంత ఎత్తులో ఉన్న పర్వత శిఖరాలపై జాతీయ జెండాను ఎగరవేసి భారత ఖ్యాతిని యావత్ ప్రపంచానికి చాటిన యశ్వంత్ ధైర్య సాహసాలను గవర్నర్ అభినందించాడు. ఈ నెల ఆస్ట్రేలియాలోని పర్వతారోహణకు వెళ్తున్నట్లు యశ్వంత్ గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేయనున్నట్లు గవర్నర్ చెప్పినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రపంచంలోని పేరుగాంచిన మరెన్నో పర్వాతరోహణలు చేపట్టి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని గవర్నర్ సూచించినట్లు తెలిపాడు.

అలుపెరుగని జీవితం రైతన్నది

- సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్


మిర్చితోటలో కాయలు తెంపుతున్న సబ్ రిజిస్ట్రార్

ములుగు రూరల్: ప్రకృతితో పోరాడుతూ అలుపెరుగని జీవితం గడిపేది రైతన్న అని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సెలవు రోజు కావడంతో మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక ఉత్తమ్‌కుమార్ – అర్పితలకు చెందిన మిరపతోటలో కూలీ పనులకు వెళ్లారు. తోటి కూలీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి కలివిడిగా గడిపారు. రైతు ఇచ్చిన కూలీ డబ్బులు రూ.200లకు మరికొంత డబ్బు కలిపి నిరుపేద కూలీకి అందించారు. జిల్లా స్థాయి అధికారి కూలీలతో కలిసి వ్యవసాయ పనుల్లో పాల్గొనడంతో కూలీలు ఆశ్చర్యానికి గురయ్యారు.

దృష్టి మరల్చి దొంగతనం

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ క్రైం: దృష్టి మరల్చి దొంగతనానికి పాల్పడిన ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన చించు, గుగులోతు స్వప్న, వెంకటాపూర్ మండలం నల్లకుంటకు చెందిన ఇటికల సురేందర్‌లను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. హన్మకొండ బాలసముద్రంలో రామాంచ కొంరమ్మ వృద్ధురాలిని మెడలో గొలుసు ఇవ్వలని, ఒక ఫోటో తీసుకోని ఇస్తామని నమ్మబలికి పరార్ అయినట్లు ఆయన తెలిపారు. నిందితులు హనుమకొండ బాలసముద్రంలో రామాంచ కొమురమ్మ అనే వృద్ధురాలి మెడలో గొలుసు ఇవ్వాలని, ఫొటో తీసుకుని ఇస్తామని నమ్మించి పరారయ్యారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి టైలర్ స్ట్రీట్‌లో పట్టుకుని రూ.50 వేల విలువైన 12 గ్రాముల బంగారు గొలుసు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాయమాటాలు చెప్పే వారిని నమ్మి విలువైన వస్తువులు ఇవ్వొదని సూచించారు.


అన్ని మతాలకు ప్రాధాన్యం

- మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య


ఈద్గా మసీదులో సీసీ కెమెరాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ తదితరులు

ఖిలా వరంగల్: సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర రోడ్లు, భవనాల సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వరంగల్ ఫోర్టురోడ్డులోని ఈద్గా మసీదు ప్రాంగణం, ఖబ్రస్తాన్‌లో దర్గా కేర్‌టేకర్ ఎంఏ తన్వీర్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ముస్లిం మహిళల ఉపాధి కల్పనకు కుట్టుమిషన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రుపాషా, ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ మోహినుద్దీన్ ఖాద్రి, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, మాజీ కార్పొరేటర్ ఎంబాడి రవీందర్, ఎంఏ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో 'వనం' హఠాన్మరణం


సంపత్‌కుమార్‌రావు (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన వనం సంపత్‌కుమార్‌రావు (66) భారత కాలమానం ప్రకారం అమెరికాలోని వర్జీనియాలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సంపత్‌కుమార్ హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల, భద్రాచలం, మహబూబాబాద్ డిగ్రీ కళాశాలల్లో లైబ్రేరియన్‌గా పని చేసి 2014లో రిటైర్ అయ్యారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. అమెరికాలో ఉండే కుమార్తె వద్దకు ఈ నెల 4వ తేదీన వెళ్లిన ఆయన గెండెపోటుతో మృతిచెందారు. కాగా, బుధవారం వరకు పార్థివదేహం ఇండియాకు వస్తుందని సంపత్ బావమరిది శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కళాశాల టీచర్ల సంఘం అధ్యక్షుడు పులి సారంగపాణి, కార్యదర్శి మల్లారెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణమూర్తి, ఎన్వీఎస్ చారి, సంఘం బాధ్యులు సంతాపం ప్రకటించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


విజేతలతో సుధాకర్(ఎడమ పక్క నిల్చున్న వ్యక్తి)

దోర్నకల్: హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ భారత్‌వీర్ వ్యాయామశాల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. చిక్కడపల్లి బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీ హాలులో మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో భారత్‌వీర్ వ్యాయామశాలకు చెందిన క్రీడాకారుడు మండలోజు సుధాకర్ 55–60 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగం నుంచి పాల్గొని క్లీన్ 60 కేజీలు, స్నాచ్ 50 కేజీల బరువు కలిపి 110 కేజీల బరుపు ఎత్తి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 35–40 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగంలో క్లీన్ 60 కేజీలు, స్నాచ్ 50 కేజీలు కలిపి 110 కేజీల బరువు ఎత్తి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. సుధాకర్‌ను మంత్రి సత్యవతిరాథోడ్ సన్మానించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఆత్మకూరు: బావమరిది, అత్త దూషించారని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అక్కంపేటకు చెందిన మాదాసి మధుకర్(30)కు పైడిపెల్లికి చెందిన మానసతో 4 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి తరచుగా గొడవ జరిగేది. ఈ క్రమంలో మధుకర్ బావమరిది రమేష్, అత్త వరలక్ష్మి మధుకర్‌ను దూషించారు. దీంతో మనస్తాపానికి గురై శనివారం అక్కంపేటలో కెనాల్ వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మధుకర్ తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

హన్మకొండ చౌరస్తా: వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు చెందిన రమ(30) కడుపులో సమస్యతో బాధపడుతుండగా.. ఈనెల 13న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు రమను అడ్మిట్ చేసుకుని మరుసటి రోజు ఆపరేషన్ చేశారు. శనివారం సాయంత్రమే రమ మృతి చెందినప్పటికీ ఆరోగ్యశ్రీ నుంచి డబ్బులు ఆస్పత్రిలో జమయ్యాక ఆదివారం సాయంత్రం తెలియజేశారని మృతురాలి బంధువులు రోదిస్తూ చెప్పారు.

ఏసీపీ నేతృత్వంలో హత్యకేసు దర్యాప్తు

- పోలీసుల అదుపులో నిందితులు..!
- కొనసాగుతున్న విచారణ

ఖిలా వరంగల్: ×తమ్ముడిని చంపిన అన్న¤ హత్య ఘటన నగర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ నేతృత్వంలో శ్రీకాంత్ హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. తమ్ముడిని అన్న కర్రతో కొట్టి.. శరీరంపై పెట్రోల్ పోసి.. ఆపై బండరాయితో మోది హత్యచేసిన ఘటనను పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. తన వాటాకు వచ్చిన ఇంటి స్థలాన్ని విక్రయించి నగరం నుంచి దూరంగా వెళ్తున్నానని చెప్పినందుకే శ్రీకాంత్‌పై అన్న గోవిందుల శ్రీధర్ కక్ష పెంచుకొని తమ్ముడిని హత్యచేశాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. హత్యకు ఉపయోగించిన కర్ర, పెట్రోల్ డబ్బా, బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్ హత్యకేసులో అనుమానితులైన గోవిందుల శ్రీధర్, అతడి భార్య గోవిందుల అనిత, అతడి వదిన గోవిందుల రాజమ్మను శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులను పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఇసుక లారీ


విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాల్వపల్లి నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న లారీకి బ్రేకులు ఫెయిల్ అయి ఒడితల మూల మలుపు వద్ద 11కేవీ విద్యుత్ స్తంభానికి ఆదివారం ఢీ కొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ వైర్లు కింద పడ్డాయి. అలాగే పాఠశాల ప్రహరీ కూలిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా బస్టాండ్ సమీపంలో ప్రజలు నిత్యం ఉండేవారని, ఎండకాలంగా కావడతో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింద గ్రామస్తులు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సందర్శించి అక్కడి నుంచి లారీని తొలగించారు. ఇదిలా ఉండగా.. గ్రామంలో విద్యుత్ సరాఫరా నిలిచిపోవడతో సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మీ విద్యుత్ సిబ్బందిచే మరమ్మతులు చేయించారు.

మస్కట్‌లో అంబేడ్కర్ పుస్తకావిష్కరణ



నెక్కొండ/కాజీపేట అర్బన్: అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఉమాన్‌లోని మస్కట్‌లో ఎన్ఆర్ఐ వింగ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్, ఎన్ఆర్ఐ ఒమాన్ మహమ్మద్ ఇమామ్ ఆధ్వర్యంలో ఈనెల 14న శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి పాస్ట్రేట్ చైర్మన్ కవి, రచయిత డాక్టర్ రేవ పెండ్యాల బాబురావు ఆదివారం వివరాలు వెల్లడించారు. తను రాసిన రచనలతో కూడిన పుస్తకాన్ని మస్కట్‌లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వెంట జాన్ విక్టర్, రాజారత్నం, మోహన్, అనిల్, ఆంజనేయులు, రామ్‌దాస్, చంద్రిక ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మల్లయ్య(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి జాన్‌పాక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిరుకుల మల్లయ్య(80) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వంచనగిరికి చెందిన మల్లయ్య సాయంత్రం 6 గంటల సమయంలో వరంగల్ వైపు నుంచి తన గ్రామానికి సైకిల్‌పై వెళ్తుండగా నర్సంపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం


ఓ ఇంటిఎదుట పసుపు, కంకుమ

వరంగల్ చౌరస్తా: వరంగల్ 26వ డివిజన్‌లోని గిర్మాజీపేట రామావారి వీధిలో క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా రామావారి వీధిలో ఒక రోజు ఒక ఇంటి ఎదుట పసుపు, కుంకుమ, మరో రోజు మరో ఇంటి ఎదుట కోడిగుడ్లు, జీడిగింజలు, గవ్వలు, ఆదివారం చనిపోయిన కోడి, గుడ్లు, తదితర వస్తువులు ఇళ్ల ఎదుట కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోలీసు సిబ్బంది వివరాలు సేకరించి వదిలేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇస్తున్నారని పేర్కొంటున్నారు.

అక్కాతమ్ముళ్లను కలిపిన 'బలగం'


లింగారెడ్డి


పప్పు లక్ష్మి


అక్క లక్ష్మి ఇంట్లోకి వెళ్లి బోరున విలపిస్తున్న లింగారెడ్డి

లింగాలఘణపురం: మండల పరిధి వనపర్తిలో ఇటీవల ప్రదర్శించిన 'బలగం' సినిమా మనస్పర్థలతో దూరమైన అక్కా.. తమ్ముడి కుటుంబాలను కలిపింది. వివరాలిలా ఉన్నాయి. అనుముల లింగారెడ్డి, లక్ష్మి అక్కా తమ్ముళ్లు. లక్ష్మిని అదే గ్రామంలో పప్పు వీరారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. రెండు కుటుంబాలు వనపర్తిలోనే ఉంటున్నాయి. 15 ఏళ్ల క్రితం లింగారెడ్డి కూతురు రజిని వివాహవేడుకల్లో లక్ష్మిని ఫొటో తీయకపోవడంతో భోజనం చేయకుండా అలిగి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ రెండు కుటుంబాల మధ్య సంబంధాలు దూరమయ్యాయి. ఏడాదిన్నర క్రితం లక్ష్మి భర్త వీరారెడ్డి మృతి చెందగా.. అంత్యక్రియల సమయంలో లింగారెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నాడు. దీంతో అతడి భార్య వసంత, కొడుకు శ్రీకాంత్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లొచ్చారు. అయినా రెండు కుటుంబాలు కలిసిపోలేదు. ఇటీవల సర్పంచ్ ఉంగరాల శ్రీధర్ గ్రామంలో బలగం సినిమాను పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఆ సినిమా చూసిన లింగారెడ్డి, లక్ష్మి హృదయాల్లో మార్పు వచ్చింది. పంతాలు వదిలేసి సర్పంచ్ శ్రీధర్, గ్రామస్తులు మహేష్, రవీందర్‌రెడ్డి సమక్షంలో ఈనెల 15న లింగారెడ్డి తన అక్క లక్ష్మి ఇంటికి వెళ్లాడు. దీంతో గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.